ప్రజాశక్తి
సోమవారం 30 డిసెంబర్ 2024 5 అనంతపురం



నేడు వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, నగరకార్యదర్శి రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా అనంతపురం జిల్లా కేంద్రంలో టవర్‌క్లాక్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంతా భేష్..!

పాజిటివిటీ చూపించాలంటున్న ఎస్పీ
నేర గణాంకాల్లో గోప్యత
పెరిగిన అట్రాసిటీ, మహిళలపై హింస

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'నెగెటివిటీ ఎందుకు... పాజిటివిటీ ఉంటే బాగుంటుంది.' అని జిల్లా ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. శాంతిభద్రతలంతా జిల్లాలో భేష్‌గా ఉన్నాయని కితాబునిచ్చారు. వార్షిక నేర గణాంకాల వివరాలను వెల్లడించేందుకు పోలీసు కాన్ఫరెన్సు హాలులో జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వార్షిక నేర గణాంకాలేవీ ఇవ్వకుండానే అంతా బాగుందని చెప్పడం గమనార్హం. నేరాల్లో అత్యంత ప్రధానమైనవి మహిళలపై హింస, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు. వీటి గణాంకాల నివేదిక కనబరచకుండానే పెరిగాయని చెప్పి దాటవేశారు. ఏ మేరకు పెరగాయన్న దానిపై స్పష్టతలేదు. ఫోక్సో కేసులు మాత్రం ఎనిమిది శాతం తగ్గినట్టు నివేదికలో కనబరిచారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సగటున రోజుకు 40 మందిపై కేసులు

వాహనాలు నడిపే సమయంలో రోడ్డు ఉల్లంఘనలు, ఆరు బయట మద్యం సేవించే వారిపై సగటున 38 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మొత్తంలో చూసినప్పుడు 1409 కేసులు నమోదయ్యాయి. ఇక డ్రంక్ అండ్ డ్రైవ్, మరికొన్నింటిపై 2314 కేసులు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున ఆరు కేసులు నమోదయ్యాయి. ఎన్‌ఫోర్సుమెంట్‌లో 15 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేసి 63 మందిని అరెస్టు చేశారు. రూ.4.70 లక్షల విలువైన 60 కిలోల గంజాయిను పట్టుకున్నారు. జిల్లాలో 1192 గ్యాంబ్లింగ్ కేసులు నమోదు చేసి 3250 మందిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.1.98 కోటి నగదు స్వాధీనం చేసుకున్నారు.

నేరాల అదుపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

నేరాల అదుపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నట్టు జిల్లా ఎస్పీ జగదీశ్ తెలిపారు. అఫెండర్ సర్వేలెన్సు కోసం యాప్‌ను రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో నేరాస్తులను సులువుగా కనిపెట్టే విధంగా ఆ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. అదే విధంగా ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య తెలిత్తినప్పుడు అందరినీ హై అలర్టు చేసే విధంగా హై అలర్టు యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. సైబర్ నేరాల అదుపునకు కూడా ప్రత్యేకంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జనవరి మాసంలో సైబర్ నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

పోలీసు గుడ్‌వర్క్

పండమేరుకు వరద వచ్చిన సమయంలో నీటిలో చిక్కుకున్న ఐదుగురిని కాపాడామని ఎస్పీ తెలిపారు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద గుర్తు తెలియని మహిళ హత్య కేసును ఛేదించామని చెప్పారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని హత్య కేసు, సర్వజన ఆసుపత్రి శిశువు అపహరణ కేసును రెండు గంటల్లో ఛేదించామని పేర్కొన్నారు. కణేకల్ మండలంలో దళితుల ఆలయ ప్రవేశాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆలయ ప్రవేశం చేయించామని చెప్పారు. రాయదుర్గంలో బీఎస్పీ నాయకుడు హత్య కేసు ఛేదింపు ఇలా అనేక కేసుల్లో మంచి పురోగతి సాధించామని తెలిపారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి

సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఇప్పుడున్న స్టోర్‌ను మరింతగా విస్తరించనున్నట్టు చెప్పారు. హోంగార్డుల పిల్లలకు ప్రోత్సాహకాలందిస్తున్నామన్నారు. మంచి సౌకర్యాలతో స్పోర్ట్స్‌మీట్, ఫుట్ కోర్టులో సిబ్బందికి తక్కువ ధరకే అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించామన్నారు ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

కనుమరుగవుతున్న అటవీ సంపద



- అధికారుల చేతిలో వాల్టా చట్టం ఉల్టా
- వృక్ష సంపద కంటే డబ్బు సంపాదనే ముఖ్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో పర్యావరణవేత్తలు

నన్ను కొడుతున్నారని చెట్టు చెప్పలేదు.. బహిరంగంగానే రవాణా అవుతున్నా అధికారులు పట్టించుకోరు. వెరసి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. జిల్లాలో కొంతమంది కలప వ్యాపారులు ధనార్జన కోసం నిబంధనలు మీరుతున్నారు. వాల్టా చట్టంపై గొడ్డలి వేటు వేస్తూ రోడ్ల వెంట ఉన్నా చెట్లను రోడ్డు అభివృద్ధి పేరుతో నరికేస్తున్నారు. వాటిని ఇటుక బట్టీలు, హోటళ్లు, టింబర్ డిపోలకు తరలిస్తున్నారు. రోడ్ల వెంట ఉండే పొలాల్లోని తమ పైరుపై చెట్టు నీడ పడుతోందని, పంట సరిగా పండడం లేదని రైతులు ఫిర్యాదు చేస్తే కేవలం కొమ్మల వరకు తొలగించుకోవాలని అధికారులు అనుమతిస్తారు. అలాంటిది వేప, నల్లతుమ్మ సహా అనేక రకాల భారీ చెట్లను అక్రమార్కులు కొట్టేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా చెట్లు పెంచేవారు లేకున్నా ఇంత పెద్ద మొత్తంలో కలప ఎలా రవాణా అవుతుందనే అంశంలో అధికారుల ఉదాశీనతే అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

అక్రమ కలప రవాణాను అడ్డుకుని వృక్ష సంపదను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారు. కలప వ్యాపారుల నుంచి అటవీ శాఖ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడటంతో విలువైన కలపను కొల్లగొడుతున్నారు. ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా చెట్లు కొట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. టేకు, వేప, పాచి, ఇరిడి వంటి విలువైన కలప ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు అక్రమ మార్గంలో తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టి, పచ్చదనాన్ని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లతో పాటు రైతులు పెంచుకున్న చెట్లు సైతం అక్రమార్కులు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. దీంతో వృక్షసంపద రోజురోజుకు తరిగిపోతుంది. ప్రభుత్వ, అటవీ బీడు భూముల్లో మొక్కలు నాటినా, ఇందుకోసం ప్రభుత్వ ధనం కోట్ల రూపాయలు ఏటా వెచ్చించినా ప్రయోజనం శూన్యమే అవుతోంది. ప్రకృతిని, వృక్ష సంపదను కాపాడటానికి ప్రభుత్వం తీసుకొచ్చిన వాల్టాచట్టం అటవి, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన హిందూపురం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉల్టా అవుతోంది. అక్రమంగా కలపను రవాణా చేయడాన్ని అదుపు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం స్మగ్లర్ల ఆటను మరింత ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం చెట్లను యథేచ్ఛగా నరికి రవాణా చేయడాన్ని కట్టడి చేయడానికి చెక్‌పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ ప్రభుత్వ ఉదేశ్యం నీరుగారి పోతుంది. చెక్‌పోస్టుల దాటి అక్రమంగా కలప రవాణా జరుగుతూనే ఉంది. అయినా పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలతో పాటు లేపాక్షిలో ఉన్నా పరిశ్రమల నిర్వాహకులు యధేచ్ఛగా పరిశ్రమల్లో ఉన్న బాయిలర్లకుకలపను ఉపయోగిస్తున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి అటవీ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపిస్తున్నాయి. అన్ని ఆధారాలతో అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికి చర్యలు తీసుకోవడం పక్కన పెడితే, ఏ ఒక్కరికి కనీసం నోటీసులు సైతం ఇవ్వడం లేదని సమాచారం. మరి కొంత మంది అటవీ శాఖ అధికారులు ప్రభుత్వ భూముల్లో ఉన్నా ప్రకృతి సంపదను అడ్డంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో నరకిన చెట్లను ఇక్కడి నుంచి పావగడకు ఎగుమతి చేసుకుని అక్కడి నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబందించి అన్ని ఆధారాలతో పర్యావరణ వేత్తలు ఫిర్యాదు చేసినప్పటికి ఒక్క ట్రాక్టరు పట్టుకోలేదు. ఒక్క కేసు నమోదు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చెట్లను సంరక్షించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

చెట్లకు రక్షణ ఏదీ..

భారీగా చెట్లను నరికి వేయడం వలన చెట్ల పరిరక్షణ కరువైంది. దీని వలన పచ్చదనం, ప్రాణవాయువు తగ్గిపోతోంది. కాలుష్యం పెరిగి వాతావరణం సమతుల్యం దెబ్బతింటోంది. లేపాక్షి, చిలమత్తూరు, మడకశిర, సోమందేపల్లి తదితర ప్రాంతాలలో అటవీ ప్రాంతం ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉంది. చెట్లను విపరీతంగా నరికి తరలించడం వలన అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. ఇక్కడ ఉంటున్న అడవి జంతువులు జనావాసంలోకి చొరబడుతున్నాయి. కాస్తాకూస్తో అడవి విస్తీర్ణం ఉండగానే జంతువుల ఇలా వస్తుంటే ఇక అడవులను పూర్తిగా నిర్వీర్యం అయితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మరి.

అటవీ శాఖలో అక్రమాలు

చట్టాల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని అటవీశాఖ అధికారులు కొంత మంది అక్రమార్కులకు అండగా నిలుస్తూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అక్రమ కలప రవాణాను అదాయ వనరుగా మల్చుకుని దొరికినంత దోచుకుంటున్నారు. ఇక చెక్‌పోస్టులన్నా అవి నామమాత్రంగానే ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రధానంగా చింత, వేప కానుక, మద్ది, వివిధ రకాల నీడనిచ్చే భారీ చెట్లను, ఫలాలు అందించే చింత కానుగ, వేప చెట్లను తెగనరికి తరలించేస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించే చెట్లను నరికించి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న వారికి మొక్కుబడిగానే జరిమానాల పేరుతో ఫారెస్టు అధికారులు వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



రవాణాకు సిద్ధం చేసిన చెట్టు మొద్దులు

శాస్త్రీయతతో కూడిన విద్యనందించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



డైరీలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ గేయానంద్, తదితరులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వాలు విద్యార్థులకు శాస్త్రీయతతో కూడిన విద్యను అందించాలని అప్పుడే మూఢ నమ్మకాలకు తావులేని సమాజాన్ని నిర్మించవచ్చని మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ పేర్కొన్నారు. స్థానిక సంగమేష్‌నగర్ లోని జెవివి కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రీయతతో కూడిన విద్యను అందించలేకపోతే వారికి సమస్యల పట్ల అవగాహన , విశ్లేషించే తీరు ఉండక నమ్మకమేదో మూఢనమ్మకమేదో తెలుసుకోలేరని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు శాస్త్రీయతతో కూడిన విద్య చాలా అవసరమని దాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. మూఢ నమ్మకాలపై తగిన అవగాహన కల్పించాలని,ఆచరణ సాధ్యమైన విషయాలను విడదీసి అనవసరమైన వాటిని వ్యతిరేకించినప్పుడే పటిష్టమైన శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజాన్ని నిర్మించవచ్చని చెప్పారు. అందుకోసం మనమంతా కృషి చేయాలని చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు విశ్రాంత అధ్యాపకులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమావేశం అనంతరం జెవివి రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ సాకే భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, నాయకులు జిలాన్ బాషా, గాంగేనాయక్ వీరరాజు, చిత్తప్ప, రామిరెడ్డి, తిరుపాలు, సురేష్, ముత్యాలు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానతృష్ణను ప్రోత్సహించడమే బాలోత్సవాల ధ్యేయం

బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్



సమావేశంలో మాట్లాడుతున్న షమీమ్

ప్రజాశక్తి అనంతపురం సిటీ

పిల్లల్లోని సృజనాత్మకతను, జ్ఞానతృష్ణను ప్రోత్సహించడమే బాలోత్సవాల నిర్వహణ ప్రధాన ధ్యేయమని అనంత బాలోత్సవ కమిటీ అధ్యక్షులు షమీమ్ పేర్కొన్నారు. 5 వ పిల్లల పండుగ నిర్వహించడానికి ఆహ్వాన సంఘం ఏర్పాటు కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక లలిత కళాపరిషత్‌లో క్రిసెంట్ విద్యా సంస్థల అధినేత షమీమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ సహాయ కార్యదర్శి సావిత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో షమీమ్ మాట్లాడుతూ అంతా ఒక్కటేననే భావన, దేశభక్తి, లౌకిక వాదం పెరగాలనే లక్ష్యాలతో పిల్లల వికాసానికి 'అనంత బాలోత్సవం- పిల్లల పండుగ' ఏర్పడిందన్నారు. 2020లో మొదలైన బాలోత్సవం ప్రతిఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు బాలోత్సవాలలో ప్రతి సంవత్సరం 120 నుండి 160 పాఠశాలల నుండి 4 వేల నుండి 6 వే మంది విద్యార్థులు క్రమశిక్షణతో ఆనందోత్సాలతో పాల్గొన్నారన్నారు. వీటిలో పాల్గొన్న పిల్లలు, తిలకించిన తల్లిదండ్రులు, సహకరించిన జిల్లా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయలు, అధ్యాపకులు, అవధులు లేని ఆనందాన్ని పొందారన్నారు. పిల్లల పండుగ అనే పేరు సార్థకమైనదన్నారు. ఈ నేపథ్యంలో 2025వ సంవత్సరంలో ఐదవ బాలోత్సవాన్ని నిర్వహించడానికి ఆహ్వాన కమిటీని షమీమ్ అధ్యక్షతన 60 మందితో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఛైర్మన్ తిప్పేస్వామి, లలితకళాపరిషత్ నిర్వాహకురాలు అడ్వకేట్ పద్మజ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు పల్లవి, రవికాంత్ రమణ, ప్రముఖ నాట్యాచారులు పట్నం శివప్రసాద్, ఎస్సీయు రమణారెడ్డి, యుటిఎఫ్ కోటేశ్వరప్ప, రమణయ్య, మహమ్మద్ జిలాన్, లింగమయ్య, మెడికల్ రెప్స్ అసోషియేషన్ నాయకులు శ్రీనివాసులు కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

బాలుర ఐటిఐ ప్రిన్సిపల్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

నగరానికి చెం దిన ప్రభుత్వ బాలుర ఐటిఐ ప్రిన్సిపాల్ చెన్నా రామమూర్తిని పోరుమామిళ్ల తెలుగు భాషా మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం పోరుమామిళ్ల డిగ్రీ కళాశాలలో 'సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథ, కవిత, నవల - సాహితీ సమాలోచన సదస్సు' నిర్వహినంచారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి రచించిన నవల 'కొండ పొలం -సామాజిక జీవన పోరాటం' అన్న అంశంపై రామమూర్తి ప్రసంగించారు. దీంతో ఆయన్ను దుశ్శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో సన్మానించారు

లాయర్ శేషాద్రి మృతిపై వివాదం

అనారోగ్యంతోనే మృతి అంటున్న పోలీసులు
కొట్టడం వల్లే చనిపోయాడంటున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-అనంతపురం

లాయర్ శేషాద్రి శనివారం రాత్రి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో మృతి చెందారు. ఈ మృతిపై సర్వత్రా వివాదాలు అలుము కుంటున్నాయి. అనారోగ్యంతోనే శేషాద్రి మృతి చెందారని పోలీసులు చెబుతుండగా, పోలీసులు కొట్టడంతోనే ఆయన చనిపోయాడని లాయర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై లాయర్లు ఆదివారం నాడు సర్వజన ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. శేషాద్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. త్రీటౌన్ సిఐ శాంతిలాల్ శేషాద్రి పిలిపించి స్టేషన్‌లో కొట్టడంతోనే ఆయన మృతి చెందారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. తమపైకి రాకుండా అనారోగ్యంతో మృతి చెందాడని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ జగదీశ్ మాత్రం ఆయన అనారోగ్యంతోనే మృతి చెందినట్టు తెలిపారు. వార్షిక నేర గణాంకాల వెల్లడి సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నపై ఆయన స్పందించారు. ఆయన అనారోగ్యంతోనే మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. సిఐ శాంతిలాల్ అతి సౌమ్యుడని చెప్పారు. ఆయన గురించి వేరే చెప్పాల్సిన పనిలేదని పేర్కొన్నారు.



ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

సూక్ష్మ నీటి సాగుతో అధిక దిగుబడులు

ఎపిఎంఐపి పీడీ బి. సుదర్శన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం (ఎపిఎంఐపి) ప్రాజెక్టు డైరెక్టర్ బి. సుదర్శన్ పేర్కొన్నారు. గత 50 ఏళ్ల క్రితంతో పోల్చితే ప్రస్తుతం వ్యవసాయంలో గణనీయ మార్పులు వచ్చాయి. గతంలో ఏటా సమృద్ధిగా వర్షాలు కురిసి బావులలో, కుంటలలో, చెరువులలో, తాగు, సాగు నీరు పుష్కలంగా ఉండేవి. రానురానూ బావుల క్రింద చెరువులలో నీటిసాగు పూర్తిగా మారిపోయింది. అతివృష్టి లేదా అనావృష్టితో రైతాంగం సతమతమవుతుండగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. రైతులు 300 నుంచి 500 అడుగుల వరకు బోర్లు వేస్తున్నప్పటికీ నీరు దొరకడం గగనమైంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోవడం, ఖర్చు పెరిగిపోవడం అప్పుల్లో కూరుకుపోవడంతో వ్యవసాయం దండగ అనే స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకుపోవడానికి కాలానుగుణంగా స్పింక్లర్లు, డ్రిప్పు పరికరాలతో రైతులు తక్కువ నీటితో ఎక్కువ సాగు విధానం మొదలైంది. సమయం, కూలీల ఆదాతో పాటు ఖర్చులు తగ్గి అధిక దిగుబడి సాధించే దిశగా ప్రభుత్వం డ్రిప్పు, స్పింక్లర్లతో సూక్ష్మ నీటి సాగు విధానం తీసుకువచ్చింది. రైతులకు సబ్సిడీతో పరికరాలు అందించడం జరుగుతోంది. ఈ సందర్భంగా సూక్ష్మ నీటి సాగు పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నట్లు ఎపిఎంఐపి పీడీ సుదర్శన్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా రైతులకు కలిగే లాభాలు ఏమిటి.?

జవాబు : స్పింక్లర్లు, డ్రిప్ పరికరాల ద్వారా నీరు వృధా కాకుండా మొక్క మొక్కకు నీరు అందుతుంది. 5 ఎకరాలకు నీరు తడవలాంటే పాత పద్ధతిలో అయితే రెండు లేదా మూడు రోజులు పడుతుంది. డ్రిప్పు పరికరాల వల్ల ఒకరోజులో నీరు అందించవచ్చు. దీంతో రైతులకు సమయం ఆదా అవుతుంది. కూలీల సంఖ్య తగ్గుతుంది. విద్యుత్ ఆదా అవుతుంది. ఎరువుల వాడకం తగ్గుతుంది. నాణ్యమైన దిగుబడి పొందవచ్చు. పాత పద్ధతిలో అయితే ఎకరాకు 15 నుంచి 20 బస్తాలు వస్తే సూక్ష్మ నీటి సాగు వల్ల 30 బస్తాలు పైగానే దిగుబడి పొందవచ్చు.

ప్ర : ఈ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వివరాలు తెలపండి.?

జ : డ్రిప్పు పరికరాలకు 5 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. 5 నుంచి పది ఎకరాల వరకు అయితే 70 శాతం సబ్సిడీ అందుతుంది. అదే స్పింక్లర్లు అయితే 5 ఎకరాలకు 55 శాతం సబ్సిడీ 5 నుంచి 12.5 ఎకరాలకు 45 శాతం సబ్సిడీ అందుతుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్నకారు రైతులంటూ కేటగిరీలు ఉండవు. ఏ రైతు అయినా తీసుకోవచ్చు.



ప్ర : ఈ పరికరాల కోసం ఎవరిని సంప్రదించాలి.? ఎకరాకు ఎంత సబ్సిడీ పొందవచ్చు.?

జ : ఈ పరికరాల కోసం ఆయా గ్రామాలలో రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. విస్తీర్ణాన్నిబట్టి సబ్సిడీ ఉంటుంది. ఉదాహరణకు ఎకరా భూమికి బయట మార్కెట్‌లో అయితే రూ.30 వేలు ధర చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ద్వారా అయితే సుమారు రూ. 17 వేలతోనే పొందవచ్చు.

ప్ర : రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఎన్ని రోజులలో పరికరాలు అందుతాయి.?

జ : రిజిస్ట్రేషన్ చేసుకున్న నెల రోజులకే రైతు ఇంటి వద్దకే డెలివరీ అవుతుంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలే బాధ్యతగా రైతు ఇంటికి చేర్చుతాయి. ఈ పరికరాలకు కంపెనీ 5 సంవత్సరాలు గ్యారెంటీ ఇస్తుంది. ఏవైనా మరమ్మతు పనులు ఉంటే ఆయా కంపెనీ ప్రతినిధులే చేస్తారు.

ప్ర : ఇప్పటివరకు ఎన్ని హెక్టార్లకు పరికరాలు పంపిణీ చేశారు.? రిజిస్ట్రేషన్ కు ఇంకా గడువు ఉందా.?లి

జ : 2025 మార్చి ఆఖరుకు 30 వేల హెక్టార్లకు ఈ పరికరాలు అందించాలన్నదే లక్ష్యం. ఇప్పటివరకు 5 వేల హెక్టార్లకు పరికరాలు మంజూరు కాగా 2700 హెక్టార్లకు పరికరాలు అందించడం జరిగింది. రైతులు ఇప్పటి నుంచి వచ్చే మార్చి నెల వరకు రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువు ఉంది. గుర్తింపు పొందిన 28 కంపెనీలు ఈ పరికరాలను సరఫరా చేస్తాయి.



పీడీ సుదర్శన్

ప్ర : సూక్ష్మ నీటి సాగుపై రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.? సిబ్బంది కొరత ఉందా.?

జ : సిబ్బంది కొరత అంటూ లేదు. ఉన్న సిబ్బందితోనే రైతులకు సేవలు అందిస్తున్నాము. రైతులకు సూక్ష్మనీటి సాగు విధానంపై గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నాం. పాత పద్ధతిలో కాకుండా నూతన సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న పరికరాల ద్వారా వ్యవసాయంలో నష్టం కలగకుండా అధిక దిగుబడులు సాధించాలని కోరుతున్నాం. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే ఆయా గ్రామ రైతు కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

మార్కెట్లు, సంతల ప్రయివేటీకరణ ఆపాలి

జాతీయ ఏకీకృత మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలి-ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మార్కెట్లు, సంతల ప్రయివేటీకరణను ఆపడంతోపాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ ఏకీకృత మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న పశువుల సంత వద్ద రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా నిర్వహించే సంతలపై మోడీ ప్రభుత్వం కన్ను పడిందన్నారు. సంతలను క్రమేపీ ప్రయివేటీకరించి కార్పొరేట్ల హస్తగతం చేసేందుకు బిజెపి సర్కార్ పూనుకోవడం దుర్మార్గమన్నారు. జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం పేరుతో రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌లో స్పష్టం చేసి రాష్ట్రాల్లో సంతలు, మార్కెట్లను అదాని, అంబానీలకు కట్టబెట్టడానికి సిద్ధం అవుతోందని హెచ్చరించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడం సంప్రదాయంగా సంతలు, మార్కెట్లను వినియోగించుకుంటారన్నారు. ఇప్పటికే స్థానిక వ్యాపారులు, దళారుల పాత్ర సంతల్లో ఎక్కువగా ఉంటోందన్నారు. ఇక ప్రయివేటీకరణ చేస్తే చిన్న వ్యాపారులకు నష్టం చేకూరే అవకాశం ఉందన్నారు. కావున రైతులకు నష్టం చేసే కేంద్ర ప్రభుత్వం పంపిన జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, రైతుసంఘం నాయకులు సోములదొడ్డి రామకృష్ణారెడ్డి, వన్నూరప్ప, రంగారెడ్డి, ఓబులేసు, ఎర్రగుంట్ల మహేసందరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, నారాయణ, రైతులు పాల్గొన్నారు.



అనంతపురం సంతలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపి రైతు సంఘం నాయకులు, రైతులు

కళ్యాణదుర్గం రూరల్ : మార్కెట్లు, సంతల ప్రయివేటీకరణ ఆపాలని, జాతీయ ఏకీకృత మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి రైతు సంఘం కళ్యాణదుర్గం కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు మాట్లాడుతూ అనాదిగా నిర్వహించే సంతలపై ప్రధాని మోడీ ప్రభుత్వం కన్ను పడిందన్నారు. దీంతో మార్కెట్లు, సంతలను ప్రయివేటీకరించేందుకు బిజెపి సర్కార్ పూనుకుందన్నారు. ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా సంతలు, మార్కెట్లను అగ్రి బిజినెస్ సెంటర్లుగా మారుస్తామని జాతీయ ఏకీకత మార్కెట్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ కార్యదర్శి శుభన్, నాయకులు దివాకర్, వెంకటేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రభుత్వానికి, పోలీసు శాఖకు మంచి పేరు తెద్దామని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. సోమవారం నుంచి వచ్చేనెల 17వ తేదీ వరకూ నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో నిర్వహించనున్న పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల ట్రయల్ రన్ నిర్వహించారు. ఇందులో భాగంగా అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించే ద్వారం మొదలుకుని, ధ్రువపత్రాల పరిశీలన, ధ్రువపత్రాల కంప్యూటరీకరణ, దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని వెళ్లే ద్వారం వరకూ చేపట్టాల్సిన ప్రక్రియలను స్వయంగా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా సూచిక బోర్డులు, ఈవెంట్ ట్రయల్ రన్‌ను పరిశీలించి విధి విధానాలపై సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి రిక్రూట్‌మెంట్ బోర్డు అభ్యర్థులకు కేటాయించిన తేదీల్లో హాజరయ్యేలా సమయపాలన పాటిస్తూ తమతోపాటు అడ్మిట్ కార్డు, సంబంధిత సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం వైద్యశిబిరం, మంచినీటితోపాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డి.వి.రమణమూర్తి, ఇలియాజ్‌బాషా (ఎఆర్), జిల్లాలోని డీఎస్పీలు, పలువురు సిఐలు, ఆర్‌ఐలు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


దేహదారుఢ్య ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

యల్లనూరు : మండల కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని కోరారు.

పామిడి : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు వారి సమస్యలను ప్రజావేదికలో విన్నవించుకుని పరిష్కరించుకోవాలని కోరారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

న్యాయం చేయండి..

అధిక వడ్డీ ఆశచూపి పెద్దమొత్తంలో వసూలు - పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికి దాదాపు 150 రైతులకు సుమారు రూ.5కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టిన ఘటన ఆదివారం మండల పరిధిలోని బాల వెంకటాపురంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కళ్యాణదుర్గం మండలం లోని బాలవెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీంవలి, ఇమామ్‌వలి సోదరులు అదేగ్రామంలో కిరాణం దుకాణం నిర్వహించేవారు. ఈనేపథ్యంలో అధిక వడ్డీ ఇస్తా మని గ్రామంలోని పలువురితో డబ్బులు వసూలు చేశారు. కొన్ని నెలలు బాగానే చెల్లించారు. దీంతో మిగిలినవారికి నమ్మకం కుదిరింది. దాదాపు 150 మంది రూ.5కోట్ల వరకూ వడ్డీకి ఇచ్చారు. వీరందరికీ సోదరులు ఇద్దరూ ఐపీ నోటీసులు పంపించారు. దీంతో లబోదిబోమంటూ బాధితులు ఆదివారం కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు మోసం చేసిన ఖాసీంవలి, ఇమామ్‌వలి సోదరులు తమ నుంచి కొట్టేసిన సొమ్ముతో గ్రామంలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారన్నారు. బంగారం కుదువపెట్టి, డ్వాక్రా మహిళల పొదుపు సొమ్ము, రుణాలు, ఉపాధి పనుల్లో సంపాదించిన కూలి డబ్బులు ఇచ్చి నిండా మునిగిపోయామని కంటతడి పెట్టారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ పి.జగదీష్

క్యాలెండర్ల ఆవిష్కరణ

అనంతపురం క్రైం : సైబర్ నేరాల అవగాహనకు ఉపయోగపడే నూతన క్యాలెండర్‌ను ఎస్పీ పి.జగదీష్ ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన, సైబర్ స్మార్ట్ సిటిజన్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, ఏపికె ఫైల్, డిజిటల్ అరెస్ట్ , తదితర సైబర్ మోసాల గురించి అవగాహన చేస్తూ నూతన క్యాలెండర్‌లో రూపొందించారు. ప్రజలకు ఈ క్యాలండర్‌లోని అంశాలు బాగా ఉపయోగపడుతాయన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని శ్రీనివాస్ నగర్‌లో ఉన్న బాలాజీ కళ్యాణ మండపంలో రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహాసంఘం కార్యవర్గ అధ్యక్షులు తొండపునాటి శంకరయ్య, మాజీ అధ్యక్షులు పాములాయి వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు జి.పద్మజ, యువజన విభాగం అధ్యక్షులు తొండపునాటి రమేష్, నాయకులు బళ్లారి వెంకటరాముడు, సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కందికాపుల సర్పంచి శివరామయ్య సొంత ఖర్చులతో 150 మందితో టిడిపి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం నమోదు చేసుకుంటే కార్యకర్తలకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. సభ్యత్వం తీసుకుని ఒకవేళ ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5లక్షల ప్రమాద బీమా వస్తుందన్నారు. సహజ మరణానికి రూ.2లక్షలు వర్తిస్తుందన్నారు. వీటితోపాటు కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం ఫ్రీగా అందించనున్నట్లు తెలిపారు.


సభ్యత్వ నమోదు చేయిస్తున్న సర్పంచు శివరామయ్య

రోడ్డు మరమ్మతులు చేయాలని వినతి

రాయదుర్గం : రాయదుర్గం నుంచి బళ్లారికి వెళ్లే మార్గంలో పల్లెపల్లి క్రాస్ నుంచి మురడి గ్రామానికి వెళ్లే రహదారికి మరమ్మతులు చేయాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు గౌని ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించేందుకు అనేకమంది భక్తులు నిత్యం ఇక్కడికి వస్తుంటారన్నారు. అలాంటి రహదారి చాలా దుర్భరంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రెండు కంకర క్రషింగ్ ఫ్యాక్టరీల లారీలు అధిక టన్నేజీతో వెళ్తుండటంతో రోడ్డు గుంతలమయం అయిందన్నారు. కావున ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -యల్లనూరు

మండల పరిధిలోని గడ్డంవారిపల్లి-కల్లూరు గ్రామాల మధ్య వెలసిన పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయ 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకులు ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించి విజేతల ఎద్దుల యజమానులకు నగదు, బహుమతులు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ సత్యబాబు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీస్తు ఆరాధన

పామిడి : మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం క్రీస్తు ఆరాధనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ఐ చర్చిలో పాస్టర్ విశ్వమోహన్ క్రీస్తు గురించి వివరించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీరయ్య, జయరాజు, అబ్రహం, రవిరాజు, బుజ్జి బాబు, కరుణాకర్, రాజు, ప్రసాద్, రజని, డాక్టర్ కమల, మాణిక్యమ్మ, రేచెల్, మెర్సీ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య

ప్రజాశక్తి-రాప్తాడు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఎం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉంటూ అంబేద్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. దేశంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారంటే కారణం అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే అన్నారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అహంకారానికి నిదర్శమన్నారు. దీనికి ప్రధాని వత్తాసు పలకడం దారుణమన్నారు. వెంటనే అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ నిరసనల్లో ప్రజలు, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి టి.రామాంజనేయులు, సభ్యులు పోతలయ్య, ఎఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, సిపిఐ మండల కార్యదర్శి ఎం.చలపతి, కార్యకర్తలు నారాయణస్వామి, సుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలరంగయ్య

గుత్తి : పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం సిపిఎం, ప్రజాసంఘాలు, బిఎస్‌పి, ఎంఆర్‌పిఎస్, మాల మహానాడు, జెవివి, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, మహిళా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, బీఎస్పీ నాయకులు విజయ్, మాల మహానాడు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రామాంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాగా సోమవారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దిలేటి, మహిళా సంఘం నాయకురాలు కవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్ యాదవ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

31 రాత్రి పోలీసు ఆంక్షలు పాటించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం


నగరంతోపాటు జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో డిసెంబర్ 31న రాత్రి పోలీసుల ఆంక్షలు పాటించాలని ఎస్పీ పి.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా అంతటా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ల వద్ద నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. జాతీయ రహదారులు, మిగితా రహదారులు, పబ్లిక్ స్థలాల్లో వేడుకలకు అనుమతించేది లేదన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. విచక్షణా రహితంగా, స్పీడ్‌గా బైక్, కారు, ఇతర వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దన్నారు. అలాంటి రైడర్స్‌పై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, బార్‌లను నిర్ణీత సమయంలోగా మూసివేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా అనంతపురంలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. రోడ్లపై యువత మద్యం తాగి, వీధుల్లో నడుస్తూ, బైక్స్ పై తిరుగుతూ ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా మాట్లాడడం, కామెంట్ చేయరాదన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలపై కామెంట్, టీజింగ్‌లకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్నేహపూర్వక వాతావరణంలో సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కొత్త సంవత్సరం వేడుకలు చేసుకోవాలన్నారు. ఎక్కువ శబ్దాలు వచ్చే డీజే సౌండ్ సిస్టం వంటివి ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజా శాంతికి విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు. నూతన సంవత్సర వేడుకలు అర్ధరాత్రి ఒంటిగంటలోపు ముగించాలన్నారు. కొత్త సంవత్సర వేడుకలు ఎవరి జీవితాలు, కుటుంబాల్లో విషాదం మిగల్చరాదని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పటిలాగే అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మెగా బిందుసేద్యం ప్రాజెక్టును ప్రారంభించాలి

మంత్రి పయ్యావులకు జైకిసాన్ ఫౌండేషన్ నాగమల్లి వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

సామూహిక మెగా బిందుసేద్యం ప్రాజెక్టును జిల్లాలో తిరిగి పున:ప్రారంభించాలని జైకిసాన్ ఫౌండేషన్ నాగమల్లి ఓబులేసు కోరారు. ఈమేరకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సామూహిక బిందుసేద్యం ప్రాజెక్టు రాయలసీమలోని చాలా కీలకమైందన్నారు. తీవ్ర తీవ్ర దుర్భిక్షమైన పరిస్థితులు ఉన్న జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గంలో సామూహిక మెగా బిందుసేద్యం పథకాన్ని టిడిపి ప్రభుత్వం తీసుకురావడం సంతోషకరమన్నారు. 2017లో సుమారు రూ.842 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారన్నారు. 2019కి దాదాపు 70 శాతానికి పైగానే పనులు పూర్తయ్యాయన్నారు. జీడిపల్లి, పిఎబిఆర్, ఎంపిఆర్ జలాశయాల ద్వారా హంద్రీనీవా కృష్ణాజలాలను ఎత్తిపోసి బిందుసేద్యం ద్వారా 50 వేల ఎకరాలకు నీరు అందించాలనేది పథకం లక్ష్యమన్నారు. డ్రిప్ ద్వారా మూడు పంటలు పండించుకునే రైతులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో చేపట్టిన ఈ పథకంలో రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా అక్కడే ప్రాసెసింగ్ చేసే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని ప్రణాళిక చేశారు. స్థానికంగానే పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రైతులతో పాటు, వారి కుటుంబ సభ్యులకు అక్కడే ఉపాధి కల్పించాలని భావించారు. అయితే గత ఐదేళ్లలో ఆ పథకం మూలన పడిందన్నారు. ఈనేపథ్యంలో మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో అర్ధాంతరంగా ఆగిన మెగా బిందు సేద్య పథకాన్ని ప్రారంభించి మూడు పంటలు పండేలా చూడానలి కోరారు.



మంత్రి పయ్యావులకు వినతిపత్రం అందజేసున్నత్న జైకిసాన్ ఫౌండేషన్ నాగమల్లి

డ్రెయినేజీల్లో పూడికతీత

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని రామ గిరి గ్రామంలో డ్రెయినేజీలో పూడికతీత పనులు చేపట్టారు. గ్రామంలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారి మురికినీరు నిల్వ ఉండేది. దీంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో స్థానిక నాయకులు సమస్యలను గుమ్మనూరు ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులను మాట్లాడి పారిశుధ్య కార్మికులతో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు హయాగ్రీవ, బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోదనపల్లి యువకుడికి కంటెంట్ క్రియేటర్ అవార్డు

నార్పల : మండల పరిధిలోని హెచ్.సోదనపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ క్రియేటర్ అవార్డుకు ఎంపికయ్యాడు. మధుసూదన్ దర్శకుడుగా, చిత్ర కథానాయకుడిగా చిత్రీంచిన షార్ట్ ఫిల్మ్ 'రామ్' ఈనెల 22న ఇటీవల విడుదలై ప్రజాదరణ పొందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అనంతపురం కంటెంట్ క్రియేటర్ అవార్డుకు ఎంపికయ్యాడు. దీంతో అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మధు అవార్డును అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న మధుసూదన్

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్, నాయకులు బాలాజీ మాట్లాడుతూ 1970లో తిరువనంతపురంలో ఏర్పడిన ఎస్ఎఫ్ఎ 54 సంవత్సరాలు పూర్తి చేసుకుని నేటితో 55వ వసంతంలోకి అడుగు పెడుతుందని తెలిపారు. ఈ 55 ఏళ్ల ప్రస్థానంలో అనేక త్యాగాలు, అనేక పోరాటాలతో ఈదేశ పోరాట చరిత్రలో తన గూర్చి సువర్ణ అక్షరాలతో లిఖించగలిగిందన్నారు. దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వనని చెప్పి తన ప్రాణాలను దేశం కోసం తణ ప్రాయంగా అర్పించిన 8 వ తరగతి విద్యార్థి నిరంజన్ తాలూక్ దార్ స్ఫూర్తితో నేటికీ అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో స్కాలర్ షిప్స్ సాధన, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోసం, సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పన కోసం ఎన్నో పోరాటాలు చేసి వాటిని సాధించుకోగలిగామన్నారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై 55వ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలు రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు నవీన్‌యాదవ్, షేక్షావలి, కె.రాజు, వాసు, రాహుల్, మురళి పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

అనంతపురం రూరల్ : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆదివారం నగరంలోని శ్రీనగర్ కాలనీ 80 ఫీట్ మార్గంలో జరుగుతున్న రోడ్డు పనులు ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని సూచించారు. అంతేగాకుండా వేగవంతంగా పనులు చేస్తుండటం సంతోషకరమన్నారు.


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

దేశ సమైక్యత, మతసామరస్యంతో ముందడుగు

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

దేశ సమైక్యత, మత సామరస్యం వెల్లివిరియాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి ఆకాక్షించారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆదివారం నగరంలోని సైఫుల్లా బ్రిడ్జి వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. మత స్వేచ్ఛ, ప్రజల వ్యక్తిగత హక్కు, మత విశ్వాసాలపై భరోసా కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం మైనార్టీలపై దాడులు చేస్తున్న దుష్టశక్తులకు తోడ్పాటు అందిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న దాడుల్ని సిపిఎం ఖండిస్తోందన్నారు. ఏదిఏమైనా 'గడప లోపల మతం - గడప దాటితే భారతీయులం' అన్న నినాదంతో ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ముత్తుజ, వెంకటనారాయణ, వలి, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు రాజు, వెంకటేష్, ఆదినారాయణ, ప్రసాద్, లతీఫ్, నగర నాయకులు నూరుల్లా, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హేమాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడే ఏకైక పత్రిక ప్రజాశక్తి అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ శామెల్, పోలీసులు అల్తాఫ్, శివ శంకర, రమణ, ప్రజాశక్తి విలేకరి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ హేమాత్రి

ఉచిత కంటి వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని సిద్ధిరాచర్ల గ్రామ పంచాయతీ దుర్గం గ్రామం కమ్యూనిటీ హాల్‌లో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో శస్త్ర చికిత్స అవసరమైన వారిని శాంతిరామ్ ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమం ఆప్తమాలజిస్ట్ తిప్పేస్వామి, వార్డు మెంబర్ ఉజ్జినప్ప, పరంధాముడు, పార్వతి, పుల్లన్న, సోమశేఖర్, ఆశా వీరనారాయణమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నార్పల : డిసెంబర్ 31 రాత్రి ప్రతి ఒక్కరూ పోలీసుల నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి పబ్లిక్ స్థలాలు, పాఠశాలల ఆవరణలు, క్రీడా మైదానాల్లో వేడుకలకు నిర్వహించేందుకు అనుమతులు లేవన్నారు. అలాగే టపాసులు కాల్చడం నిషేధం అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. అలాంటి రైడర్స్ పై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తించరాదన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో సన్నిహితులు, కుటుంబ సభ్యులతో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గాలివీడు ఎంపిడిఒపై దాడి అమానుషం

శింగనమల : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒపై వైసిపి నాయకుడు దాడి చేయడం అమానుషమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎంపిడిఒపై వైసిపి నాయకులు దాడి చేయడం క్షమించరాని నేరం అన్నారు. అధికారం కోల్పోయిన నేపథ్యంలో వైసిపి నాయకులు విచక్షణ కోల్పోయి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో కూడా ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి దాడులు, దౌర్జన్యాలు సాగవన్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటుందన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన వచ్చేనెల 3వతేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పేకాట స్థావరాలపై దాడులు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని బొమ్మగానిపల్లి వంక తండాలో దాడులు నిర్వహించి ఐదుగురు పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బొమ్మగానిపల్లివంకు కొంచెం దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడుల చేయగా ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రూ.3,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ నరేంద్రకుమార్

మిలిటరీ మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం దాడులు నిర్వహించి డిఫెన్స్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నలుగురిని అరెస్టు చేసి 79 ఫుల్ బాటిళ్ల డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.